# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮. | 7 1921 కాకినాడ:—శనివారము, ౭, మే, ౧౯౨౧. | చందా సం॥ రు. ౩

సంచిక ౧౯. | విడిసంచిక అ ౧.

ఓమ్.

ప్రభూ! పరమేశ్వరా! నీవన్న మాకెంత భయము లేదు. నీమాట యన్న మాకెంత లక్ష్యము లేదు. కాని లోకమన్న విపరీత భయము. లోకుల మాట మీఱుట యన్న ప్రాణసంకటముగా నుండును. ఎన్ని కడగండ్లు పడియైన జనుల మెప్పింపవలయుననియే చూచుచుందుము. వారిని సంతోషపెట్టుటకై అబద్ధములాడుదుము. వారి ప్రీతిని పొందుటకై యెన్నియో వేషములు వేయుదుము. ఎక్కడ లోకులకు మాపై కోపమువచ్చునో యని యెంతో మెలకువ కలిగి వర్తించుచుందుము. ప్రభూ! నీకంటె లోకము మాకెక్కువా? నీ ప్రీతిని పోగొట్టుకొన్న తర్వాత లోకులు మమ్మెంత భూషించిన నేమి? ఎంత పూజించిన నేమి? క్షణభంగురమైన లోకముయొక్క పొగడ్తకు భ్రమించి శాశ్వతమైన నీదు ప్రీతిని గోల్పోవ సిద్ధపడెడు మా మూర్ఖతను నశింపజేయుము. లోకముకంటె నిన్నధికముగా నెంచెడు శుభబుద్ధిని ప్రసాదింపుము. నీ ప్రేమను బడయుటకై యెట్టి త్యాగమునైన చేసెడు సాహసమును మాకు దయచేయుము.

---

ఓ ప్రాంచిక మనుజులారా, మీయజ్ఞానము మీకెంత కీడు చేయుచున్నది! మీశరీరములు తప్పక మట్టిలో కలయుట నిక్కమే. మనుజులు వృద్ధులై, రోగపీడితులై తుదకు చచ్చుట సత్యము. ఇది తెలిసియు నేల అస్థిరభోగములకు ఆసించెదరు?

... ... ...

తనధనమును, పరుల మేలుకొరకు ఖర్చుపెట్టు దయాశీలుడే, నిజముగా ధనవంతుడు. కోట్లకొలది ధనము కలిగియుండియు ధర్మము చేయనెఱుంగని లోభియే దరిద్రుడు. నాటినవాడే ఫలమును బొందువాడు.

(బుద్ధుడు)

---

## విశ్వాసపూర్వకమైన ప్రార్థన.

—:o:—

ప్రార్థనకు ఎక్కువ మాటలతో పనిలేదు. సాధ్యమైనంతవఱకు తక్కువ మాటలు ఉపయోగించుటయే మంచిది. తక్కువ మాటల నుపయోగించినను, ఎక్కువ మాటల నుపయోగించినను, ఉపయోగించెడు ప్రతి వచనమును చక్కగా ఆలోచించి ఉపయోగింపుము. సంపూర్ణ విశ్వాసముతో నుపయోగింపుము. నీకు విశ్వాసము లేని విషయములను గాని, నీకు అర్థముగాని విషయములను గాని నీవు ప్రార్థనలోనికి గానియ్యకుము. నీవు ప్రయోగించు ప్రతివాక్యము మూలమునను నీ యథార్థమైన స్థితినే సర్వసాక్షియగు భగవంతుని యెదుట బెట్టుము. నిర్మల హృదయముతో నుచ్చరించెడు ప్రతి వాక్కును తగిన ప్రత్యుత్తరమును తప్పక బడయగలదు. విశ్వాసపూర్వకమైన ప్రార్థన ఎన్నడును వృథా కాజాలదు. తప్పక వెంటనే తగిన సమాధానమును పొందును. విశ్వాసముతో నీ వెన్నడును ప్రార్థనలను చేయవు. కాన ఈసత్యమును నీవు గ్రహింపజాలకున్నావు. నీవు చేసెడు ప్రార్థనలు సామాన్యముగా నీ జ్ఞానమునో, నీ భాషాపాండిత్యమునో, నీ ఉద్రేకమునో వెల్లడించును. అవి కేవలము గతానుగతికములగు సాధారణ ప్రార్థనలు. (ముజుందారు.)

VIRESALINGAM THEISTIC LIBRARY
NO..............

# జన్మభూమి.

—:o:—

నానకే వనమందు నానంద మొప్ప
బరగి భగవంతు డొకడని పాడినాడో
చిష్తి యే దేశమందు వసించి ప్రజల
కీశ్వరుం డొక్క డనుచు బోధించి నాడో
రామమోహను డే వీట గ్రాలినాడో
అల దయానందు డే చోట నలరి నాడో
అల కబీరుడే సీమను కలిగినాడో
అదియె నాజన్మ భూమి నా కదియె తల్లి.

... ... ...

ఆర్యు లే పుణ్యభూమియం దవతరించి
ప్రకృతిలో విద్యలను దీసి వ్రాసినారో
కపిలు డెచ్చట జీవసాంఖ్యమును దెలిపె
శంకరుం డెచ్చ డద్వయాశ్రమును నిలిపె
మొగలు లే సీమ తమమాతృ భూమి యనిరో
అరబు లే భూమి కేగి ఘోరాటవులను
బాసి భాసిల్లినారో యా భరత భూమి
అదియె నాజన్మ భూమి నా కదియె తల్లి.

... ... ...

యవనులకు నేది యాశ్చర్య మందజేసె
అఖిల జగముల కేది విద్యల నొసంగె
అఖిల లోకములకు నేది యన్న మిడియె
అఖిల జాతుల కేది యుపాధి యగునో
మట్టిలో దేని బంగారు మహిమ గలదో
తురక లోడిలోన రత్నాలు గురిసె నేది
పాడిపంటలు మితిలేక పండు నేది
పశు గణంబుల పచ్చిక పట్టు నేది
వసువు లెచ్చోట నుండు రేబవలు విడక
కర్మ సాక్షికి నెచ్చోట ఘనత గలదు.
కర్మ వీరుల కెచ్చోట కాపురంబు
అదియె నాజన్మ భూమి నా కదియె తల్లి.

... ... ...

పారసీక సభంబును బాసి నట్టి
చుక్క లే చోట తిరిగి తళుకు మనెనో
అవనియందే పురాన సధ్యాత్మ గీతి
మురళిలో విను భాగ్యంబు పరగె నొక్క
ఎచట కాళింది ఫణముల నెక్కి ద్రొక్కు
గజ్జెల రవంబులను విన గలిగినారో
శ్రీ మహమ్మదు వారికి నేద దీర్ప
చల్లనగు గాలి యే ధాత్రి చల్లె నొక్క
రామచంద్రుని వంటి వీరప్రతాప
శాలి శూలికి నే ధాత్రి జన్మ భూమి.
అదియె నాజన్మ భూమి నా కదియె తల్లి.

... ... ...

ఎచటి భక్తులు మూసాను నెనయు వారో
ఎచటి నగములు సీనాను నెనయు నొక్క
నూహ నౌక ప్రయాణమై యే హిమాల
యమున నిలిచె జల ప్రళ యాంత వేళ
ఏది స్వర్గ సౌధమునకు నెక్కి పోవు
పూజ్య సోపానమై యొప్పు పుణ్యతల మొ
ఏ ప్రదేశమున వసంత ఋతువు నందు
కాపురము సేయు స్వర్గ సంకాశ మగునో
అదియె నాజన్మ భూమి నా కదియె తల్లి.

... ... ...

బౌద్ధముని యిల్లు జాపాను వారి కాసి
క్రైస్తు భక్తుల చిన్నజ రౌసలేము
అవనిలో బాత బడిన మహమ్మదీయ
వైభవంబుల కేది నివాస భూమి
పుణ్య సతులకు నదులకు పుణ్య మిచ్చు
క్షేత్రములకు పవిత్ర చరిత్రములకు
నేది కాణాచి ఋషులకు నేది యిల్లు
ప్రీతి సుమంబును నేదేశ వసుధయందు
స్వర్గ సుమముల బోలు వాసనలు వేయు
నదియె నాజన్మ భూమి నా కదియె తల్లి.

ఉమర్ అలీషా.

# భారత జాతీయత.

—o:o:o—

[శ్రీ రవీంద్రనాథ ఠాకూరు గారు.]

## VI

పాశ్చాత్య దేశీయులు పరదేశీయులతోనే గాక తమ సంఘమునందలి వేరు వేరు ఉపజాతుల మధ్యనే సామరస్యమును కలిగించుకొన జాలక పోవుచున్నారు. పోటాపోటీ, విరోధము మొదలైన భావములు సంఘములో స్వేచ్ఛగా విడిచిపెట్టబడినవి. వీనికి జన్మస్థానము కలిమి, దొరతనము అగుటచే వీనియొక్క అంతము దుర్గ్రహణమునందే గాని వేరు దానియం దుండబోదు. హిందూదేశమునందు కావలసిన వస్తువులను తయారుచేయు పని సాంఘిక నిర్మాణము మీదనే ఆధారపడియున్నది. దాని పునాది సహకారమే. దేశమునకు అవసరమైన వస్తువుల నన్నిటిని సహకారభావముతో నెవరు చేయగలిగినవి వారు చేసి సంఘమునకు సమర్పించుచుండెడివారు. కాని పాశ్చాత్య దేశములందు దీనికి పునాది పోటాపోటీయే. ఎవరికి వారు ధనమును సంపాదించుటకై ప్రయత్నము చేయుచునే యుందురు. ప్రత్యేక వ్యక్తులయొక్క అభివృద్ధియే

వారి దృష్టి పథమున నుండును. ఈవ్యక్తి రేఖాగణితమునందలి గీత వలె నుండును. ఈగీతకు పొడవేగాని వెడల్పు నది యుండనే యుండదు. దేనినైనను స్థిరముగా నిలుపగలిగినంత బలము దానికుండదు. ఆ కారణముచే తన ఆశకు గాని, లాభము గానలేనెడు లోంకకు గాని అంతముండదు. తాను పెరుగు విషయములో సభ్య అడ్డము వచ్చు గీతల నన్నిటిని దాటుచు వానిలో చిక్కులను కలిగించుచు నెంత దూరమైనను పోగలుగునే గాని తన అల్పత్వము వలన తాను పరిపూర్ణత్వమును పొందవలెను అను ఆదర్శమునుండి తప్పిపోవుచునే యుండును.

మన భౌతిక తృష్ణ లన్నిటియందును మనము మితత్వము నుండవలెనని అంగీకరించుచునే యుందుము. ఆ మితత్వమును దాటుట వలన మనకు ఆరోగ్యభంగము కలుగునని కూడ మన మెరుగుదుము. కలిమిని, దొరతనమును సంపాదింపవలెనెడు దురాశకు పారము లేదా? ఆ హద్దును దాటి వృత్యవు పోజాలదా? ఈభౌతికానందములో మునిగి తేలుచున్న పాశ్చాత్య జాతు లన్నియు తమకు గలిగిన బుద్ధిశక్తుల నన్నిటిని కేవలము వస్తునిర్మాణమునందే వినియోగము చేసి యున్నతాదర్శములను కల్పించుటలో నశ్రద్ధ చేయుటలేదా? భౌతికానుభవముతోనే జీవితమును గడుపుచు దేహమును పెంచుకొనుచు ఏ నాగరికతయైనను నైతికాభివృద్ధికొరకు కృషి సలుపక యుండగలదా? మానవుడు తన సాంఘిక ఆదర్శముల ద్వారా తనలో నుండెడు భౌతిక తృష్ణల నన్నిటిని క్రమమార్గమున నుంచి సృష్టియందుండెడు ఉన్నతాదర్శములకు వానిని లోబరచుటకే ప్రయత్నము సలుపుచుండును. కతంత్ర్యమునందే బాగుగా పెరిగి అభివృద్ధి పొందుటకు అవకాశములను కలిగించు అక్కల, అస్మొటు అనునవి తప్ప యితరవిధములైన అడ్డంకు లేవియును ఆర్థిక ప్రపంచమున మన తృష్ణలకు లేనేలేవు. హిందూ దేశమున, మనలను అణచివేయునంత దూరము వెళ్లిన వెళ్లియుండి సాంఘిక మర్యాదలు కొన్ని అడ్డంకులను మన తృష్ణలమీద కలిగించినవి. పాశ్చాత్య ప్రదేశములందు ఆర్థిక నిర్మాణము మానవులను నీతి పరులనుగా జేయు భారమును వదలివేసి ధన సంపాదనమునకై నిరంతర కృషి చేయునట్లు చేసినది. దీని కేదియును శ్రేయోదాయకమైన పరిమితి యుండనక్కరలేదా?

సాంఘిక ప్రతిష్ఠాపనములలో సాధారణముగా రెండు విధములైన ఉద్దేశములు కలవు. మనలో నుండెడు ఉద్రేక స్వభావములను అనగా కామక్రోధాదులను క్రమమైన మార్గమున నడిపించి మానవుని యొక్క అభివృద్ధిని సర్వతోముఖముగా చేయుట ఒక యుద్దేశమును, సర్వభూతముల యెడలను అవ్యాజమైన ప్రేమను కలిగించుట రెండవ యుద్దేశమును అయి యున్నవి. కనుక సంఘమునగా మానవుని యొక్క యుత్తము స్వభావమునకు చెందిన నైతిక ఆధ్యాత్మిక తృష్ణల యొక్క స్వరూపమె యని చెప్పవచ్చును.

మన ఆహారము మనకు పోషకము నిచ్చుచుండును. దేహమునకు బలము నొసంగుచుండును. కాని సాధారణముగా దేహమును యుద్రేకపూరితము చేయుచుండును. మన సాంఘిక ఆదర్శములే, మానవ ప్రపంచమును మనకొరకు నిర్మించుచుండును. కాని మన మనస్సును ఈయుత్కృష్ట ఆదర్శముల నుండి మరలించి ధనము, గొప్పతనము మొదలగు వానిపై నిలిపితిమేని ఆ ధనము దాంభికతయందు ఒడలు తెలియక పడిపోవుదుము. అట్టి జీవితమునందు మన బలము ఆరోగ్యమైనదిగ గాని మన స్వాతంత్ర్యము నిజమైన స్వేచ్ఛాజీవితముగ గాని నుండజాలము. కనుక మన మనస్సునకు స్వాతంత్ర్యము లేనప్పుడు మనకు రాజకీయ స్వాతంత్ర్యములు కలిగినను మనము స్వేచ్ఛ ననుభవింపజాలము.

ప్రకృతమున రాజకీయముగ స్వాతంత్ర్యముల ననుభవించు జాతులన్నియు గొప్ప అధికారములను కలిగినవారే గాని స్వేచ్ఛ ననుభవించువారు కాదనిన సంగతిని మాత్రము మనము మరువరాదు. వారిలో నుండును ఐహిక విషయవాంఛలు దేనిచేతను కట్టుబడక పోవుటచే, పైకి స్వాతంత్ర్యముగానే కనిపించు అనేక బానిస యంత్రశాలలను నిర్మించుచున్నవి. ఎవరు ధనమును సంపాదించుటయే జీవితము యొక్క పరమార్థముగా నుంచుకొనుచుందురో అట్టివారు తమకు గూడ తెలియకుండగనే తమ దేహములను, ఆత్మలను ధనికులకో ధనము గలిగిన ప్రతిష్ఠాపనములకో అమ్మివేసికొనుచున్నారు. ఎవరు తమను రాజకీయ అధికారములు కావలెననియు, తమ రాష్ట్రము వృద్ధియయి తాము విజాతీయులపై అధికారమును నెరపవలెనెడు మోహములో చిక్కుకొందురో అట్టి వారు ఇతరులను బానిసత్వములో పడవేయునట్టి ప్రతిష్ఠాపనములకు తమ స్వాతంత్ర్యమును, మానవత్వమును ధారబోయుచుందురు. స్వాతంత్ర్యము ననుభవించుచున్నామని విర్రవీగు దేశములలోని ప్రజలు నిజమైన స్వేచ్ఛ ననుభవింపక తమలోని యే కొద్దిమంది వలననో తమరు గూడ దుస్థితియని తెలిసికొనలేని దుస్థితిలోనికి త్రోయబడుచుందురో, ఎప్పుడు జనులు, నైతికముగను ఆధ్యాత్మికముగను స్వాతంత్ర్యమును సంపాదించుటయే తమ పరమావధి యని గుర్తింపరో, అప్పుడు ఇట్టి స్థితి సంభవించియే తీరును. తమ మనోవికారముల చేతనే అనేకములైన సుడి గుండములను కల్పించుకొని ఆసుడి గుండములయొక్క మహావడి వేకంపు తిరిగి ఒడలు తెలియక ఆస్థితియే స్వాతంత్ర్యమని భ్రమపడుచుందురు. మానవుని యొక్క సత్యము నైతిక సత్యమే అగుటవలనను తనకు ముక్తి ఆధ్యాత్మిక జీవితము వలననే సంభవింపవలసి యుండుటచేతను ఏదో యొక అవసాన దినమున తమ నిజస్థితి తమకు గోచరమయియే తీరవలెను.

త. న. శ.

---

రాట్నములు —— కాకినాడ తాలూకా బోర్డు: ——

రాట్నముల వలన మనకు కలుగబోవు లాభము ఏమి యుండగలదని మొదట పలువురు హేళనచేసిరి. కాని రాను రాను అందరు వాని యుపయోగము గుర్తించుచున్నారు. కాకినాడ తాలూకాబోర్డువారు తమ యధీనమున నున్న బాలికాపాఠశాల లన్నిటిలో ప్రతి బాలిక చేత ఒక అరగంటకు తక్కువ గాని కాలము నూలు వడికించుటకు, అందునకు వలసిన రాట్నములను ప్రతి పాఠశాలకొసంగుటకు తీర్మానించుకొనినని తెలియుచున్నది. గృహములలోనే గాక పాఠశాలలందును రాట్నములు త్వరలో వెలయు సూచనలు గానవచ్చుచున్నవి.

---

సత్యమేవ జయతే

# దేశాభిమాని

శనివారము, ౭, మే, ౧౯౨౧.

## గొప్ప శుభసూచకము.

—o:o:o—

"Not for the attainment of Swaraj, do I plead the removal of untouchability. The conversion of the periahs by the Christians does not alarm me, though it makes my heart sad. I pead for the removal of the curse, to save our souls and reestablish the prestine purity of the Aryan religion."

'అస్పృశ్యతను తొలగింపుడని నేను వాదించుట స్వరాజ్య సంపాదనము కొరకు గాదు. క్రైస్తవులచే పంచములు మతాంతరులు చేయబడుట నా హృదయమును విచారమున ముంచుచున్నను నాకంత భయావహముగ లేదు. మన యాత్మల రక్షించుకొనుటకై, ఆర్యధర్మముయొక్క తొంటి పారిశుద్ధ్యము పునరుద్ధరించుటకై, ఆదోషమును తొలగింపుడని గోరుచున్నాను' అని డి. బి. కలేల్కర్ గారు ౨౦-౪-౨౧ తేదిగల 'యంగు ఇండియా' పత్రికయందు వ్రాసిరి.

మహాత్మ గాంధి, లాలా లజపత్రాయి మున్నగు మహానీయులు బెజవాడకు వేంచేసినప్పుడు కలేల్కర్ గారు కూడ వచ్చియుండిరి. వారు అచ్చటి మల్లికార్జున దేవాలయపు మెట్లు నెక్కుచు ఒక్కొక్క మెట్టు పైకి పోయినకొలది వారి హృదయము పొంగెనట కాని సగము దూరమునకు వచ్చునప్పటికి ఒక రాతిపై ఆంగ్లమున 'పంచములిక పై మెట్లమీదికి రాకూడదు' అని చెక్కబడియుండుట గాంచిన తోడనె వారి హృదయము కృంగిపోయె నట. అప్పుడు ఆ దేవాలయము పవిత్రతకు, భక్తికి, పరమార్థమునకు గాక హిందూధర్మము పొందిన అవమానమునకు, హిందువుల నావహించిన ధర్మశూన్యతకు నిలచిన చిహ్నము వలె వారికి దోచెనట. అట్లు తోచి అస్పృశ్యత నేల విడువవలెనో వారు పైవాక్యములలో తెలిపిరి. ఈవిషయమును చదువునప్పుడు వెనుక ఒకతూరి మాయూరలో జస్టిస్ సదాశివ అయ్యరుగారు చెప్పిన మాటలు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. దేవాలయము వద్దకు పంచములు రాకూడదను ఏర్పాటుండుట వలన అది తమకు దేవుడుండు గృహముగ గాక దయ్యపు కొంపవలె కాన్పించుచున్న దనిరి. దేవాలయములు దేవుని స్మరణమునకు దెచ్చుటకు, ఈశ్వరుని అవ్యాజప్రేమను ప్రకటించుటకు, సర్వమానవులు జగదేకపితయొక్క బిడ్డలని చాటుటకు, తోడ్పడవలెను. అట్లు గాక భేదభావములు, నికృష్టచింతలు, తుచ్ఛవాంఛలు కలిగించుటకు కారణభూతము లగునప్పుడు అవి యెట్లు దేవాలయ నామమున కర్హము లగును?

కలేల్కర్ గారు స్వరాజ్యవాది. నేడు స్వరాజ్యవాదులు అస్పృశ్యతను తీసివేయు విషయమున శ్రద్ధ వహించుచున్నారు. స్వరాజ్యము, స్వర్గరాజ్యము అంతటి యున్నతాదర్శము కాక పోవచ్చును. కాని స్వరాజ్యము కొరకైనను సామాన్యమైన తలంపులు, స్వార్థపూరిత ప్రయత్నములు విడుచుట మంచిదె. ఒక యంశము యోచింపవలసి యున్నది. కేవల ప్రాపంచిక సంస్థ మానవ హృదయమునకు తృప్తి కలిగింపనేరదు. ప్రాపంచిక వ్యామోహమున జిక్కికొని ప్రపంచమును తప్ప మనము ఇంకొకటి చూడకుండినను, ఏదోయొక సమయమున 'నచేదిహావేదీ న్మహతీ వినష్టిః' అని స్ఫురించక మానదు. ఆత్మసంరక్షణము మానవునకు సర్వోత్తమ కర్తవ్యము. ప్రపంచము మనల ఈశ్వరుని చేర్చు సాధనము. తెప్పవంటిది. తెప్ప ఒక గమ్యస్థానమునకు గొంపోవునది. అదె యిల్లనుకొని అందు వసించు వానికెంత యజ్ఞానముండునో అంతకంటె నెన్నియో రెట్లు అధిక అజ్ఞానము కేవల ప్రాపంచిక జీవనము గడపువానికి గలదని చెప్పవలసి యుండును. ఆత్మవిముక్తిని గూర్చి యొసంగబడు హెచ్చరిక లత్యంతావశ్యకము. కలేల్కరుగారు ధర్మము పేరు చెప్పి, ఆత్మరక్షణ పేరుచెప్పి అస్పృశ్యతా పాపమును మానుడని యుద్బోధించుట యెంతయు ప్రశంసనీయము. ప్రపంచజీవనము నెప్పటికప్పుడు ధర్మజీవనము

గా మార్చునిట్టి యుపదేశములు లేనియెడ, ప్రాపంచిక జీవనము ఎంత విస్తృతి గాంచినను స్వార్థపరత్వముననె తగుల్కొనును. కుటుంబములు, జాతులు ప్రేమ వలన నేర్పడినను అన్యులయెడ ఆప్రేమ చూపుచు తమకు దామె వృద్ధినొంద యత్నించుటకు కారణము ధర్మప్రబోధము తగినంత లేక పోవుటయె. స్వరాజ్యోద్యమ నిర్వాహకులగు మహాత్మ గాంధియు, వారి యనుచరులును ధర్మమునకు ప్రాముఖ్యత నొసంగుట గొప్ప శుభ సూచకము.

---

## కృతజ్ఞత.

—:o:—

కాకినాడ ఆంధ్ర బ్రాహ్మమండలి వారు ఈ మాసముతో అంతమగు సంవత్సరపు వ్యయముల నిమిత్తము ధర్మసాధని పత్రికకు ఏబది రూపాయల ధన సాహాయ్యము చేసినందులకు వారికి మా కృతజ్ఞతాపూర్వక వందనములు. కాగితపుధర హెచ్చుగా నుండినను చందామాత్రము హెచ్చింపక సంచికకు మూడు కాగితముల చొప్పున మొదట నాలుగు మాసములకు పైగా వాడినందున ఈవత్సరాంతమున సొమ్మునకు కొంతఇబ్బంది కలిగినది. లోటుపడిన సొమ్ములో దాదాపు సగమువరకు మండలి పూర్తి చేసినది. మిగిలినది మిత్రులు పూర్తి చేయుదురు. ఈశ్వరానుగ్రహమున పత్రిక చిరాయువు కలిగి వర్ధిల్లునని నమ్ముచున్నాము.

---

మద్యపాన నిషేధము:—

ఒక విలేఖరి ఆంధ్రపత్రికకు వ్రాసిన వృత్తాంతమును బట్టి 1920—21 వ సంవత్సరములో తమ యాజమాన్యమున నెచ్చటను కల్లు, సారాయి దుకాణము ఉండగూడదనియు, ఉన్నవానిని మూసివేయ వలసినదనియు, నెల్లూరు తాలూకా బోర్డు వారు ఏక గ్రీవముగ తీర్మానించిరని తెలియుచున్నది.

గతమాసము ౧౯ వ తేదిన లాహోరు మ్యునిసిపాలిటి వారు తమ మ్యునిసిపలు సరిహద్దులలో సారాదుకాణము లన్నిటిని మూసివేయవలెనని తీర్మానించిరి. ఈవిధముగ దేశమంతటను తాలూకా జిల్లా బోర్డులు మ్యునిసిపాలిటీలు తీర్మానించుచు వచ్చిన అచిర కాలములో మద్యపానము రూపుమాయుట నిశ్చయము.

---

## మృతులైన వారితో సంభాషణ.

—:o:—

గంటు అప్పన్న కథ.

III.

ఈవిషయమును గూర్చి విచారింపవలచిన వారికి తోడ్పడవచ్చునని మఱికొంత సమాచారమును ఈక్రింద బొందుపరచుచున్నాను.

౧౯-౧-౨౦ తేదిన పీటను పెట్టగా మామూలుగా కావలసిన వారు రాక మఱియొకరు వచ్చి తన్నుగూర్చి ఈవిధముగా చెప్పెను.

ప్ర: మీ పేరేమి ?

ఉ: చిల్లికోట.

అపూర్వమైన యీపేరును విని అక్కడ గూర్చున్నవారు నవ్వసాగిరి. అంతట ఆజీవుడు ఈవిధముగ పీటకదలిక మూలమున తెలియజేసెను.

“ మీరు నేను అక్కర లేకపోయినచో వెళ్ళి పోయెదను ”

ప్ర: మీ పూర్తి పేరేమి ?

ఉ: గంటు చిల్లికోట

ప్ర: మీకు గంటు అప్పన్నగారు ఏమగుదురు?

ఉ: నేను అతని తండ్రి సోదరుడను

ప్ర: మీరు దయచేసి అప్పన్నగారితో కలిసి ఆదివారము రండు

ఉ: అతడు నన్ను రానిచ్చునా ?

ప్ర: దయచేసి మీరు ఉదయం ౧౨ గంటలకు రండు.

(అప్పన్నగారు సాధారణముగా ప్రతి ఆదివారం మధ్యాహ్నము ౧ గంటకు వచ్చును)

ఉ: సరే

అంతట అతడు పీటను వదలి పెట్టెను. వెళ్ళినాడు గదాయని తలవని తలంపుగా వచ్చిన ఈకొత్త స్నేహితుని గూర్చి చెప్పుకొనుచు నవ్వసాగితిమి. అంతలో తిరిగి బల్ల కదలసాగెను.

ప్ర: ఎవరు మీరు ?

ఉ: వేళాకోళము చేయవద్దు. నేను ఇచ్చటనే ఉన్నాను.

ప్ర: ఇంకేమైన విశేషములు గలవా ?

ఉ: ఒక్కమాట. మమ్ముద్దరను ఒకసారి దయచేసి పిలువకుడు. (అనగా తన్ను గంటు అప్పన్నను ఒక్కసారి పిలువవద్దని భావము.)

పా. స.

---

# బ్రాహ్మసమాజము.

—o:o:o–o:o:o—

## బరంపురము.

ఈనెల తే ౨౧ ది లక్ష్మివారం యుదయము శ్రీయుత యళ్లాయి సన్యయ్యగారి దీక్షాదిన సందర్భమున, బ్రహ్మపుర బ్రాహ్మసమాజ కార్యదర్శులును, జాతీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు నగు శ్రీ నాభి జగన్నాధరావుగారు బి. ఏ; బి. ఎల్. ఈశ్వరోపాసన సలిపి "స్వదేశీయము" గూర్చి ధర్మోపదేశము గావించిరి. యీదీక్షాదిన సందర్భముననే విశాఖపట్టణమునుండి వ్యయప్రయాసములకు సరకుగొనక సన్యయ్యగారి యెడల వాత్సల్యము చేత, శ్రీ రొక్కం బాలకృష్ణారావుగారు వేంచేసి ఈశ్వర ప్రార్థన గావించిరి. కొలది హిందూ మహమ్మదీయులకు ఒక చిన్న విందు గావింపబడెను. సాయంకాలము స్వదేశ వస్తు భాండాగారము సందర్భమున శ్రీ నాభి జగన్నాధరావుగారి యాజమాన్యము క్రింద నొక సభ గావింపబడెను. సభ ఈశ్వర జాతీయ గీతములతో ప్రారంభింపబడి మంగళ గీతముతో ముగింపబడెను.

ఆరధి లింగరాజులు.

---

## దక్షిణ హైదరాబాదు.

గత మార్చి ౨౮ వ తేది నుండి 3౦ వ తేది వరకు థియొసాఫికల్ సొసైటి హాలులో సమాజ ౬ వ వార్షిక ఉత్సవము జయప్రదముగ జరుపబడినది. శ్రీమతి వినోదిని విలేంకరుగారి వలన ౫౨ వ వార్షిక రిపోర్టు చదువబడినది. హిందూ, మహమ్మదీయ, పార్సీ, క్రైస్తవ ధర్మములలోని రహస్య సూత్రములపై ఆయా ధర్మబోధకుల వలన గంభీరముగ ఉపన్యసించబడినది.

ఏప్రిలు మొదటి తేదిన, బ్రాహ్మ మహిళాసభ గావింపబడినది. శ్రీమతి బేగం సుల్తియార్ జంగ్ బహదూర్ గారు సభాధిపత్యము వహించిరి. శ్రీమతి డాక్టరు ఆహల్య మల్లన్న గారు కార్యదర్శినిగాలుగా నుండి సభ జయప్రదముగా జరుపబడినది. అనేక హిందూ, ఆది హిందూ, పార్సీ, మహమ్మదీయ, యూద, క్రైస్తవాది నారీమణులు సభకు దయచేసి వివిధ భాషలలో ఉపన్యాసములు గావించిరి.

సికింద్రాబాదు జమ్మిన్ హాలులో శ్రీ ఖాన్ బహదూర్ అబ్దుల్ రహీమ్ గారి అధ్యక్షతతో నొక సభ గావించబడినది ఆ సభలో శ్రీ N. G. వెలింకరు M. A. L. L. B. గారు ౫౨ వ వార్షిక కార్యనివేదనము చదివి వినిపించిరి. తదనంతరము ప్రొఫెసరు అబ్దులలి (ఉస్మానియ యూనివర్సిటి) గారు, బ్రాహ్మ సమాజము తత్వజ్ఞానము, అను విషయకోపన్యాసము జరపిరి. సభ జయప్రదముగా జరుపబడినది.

ఏప్రిలు రెండవ తేదిన, శ్రీ వల్లాటి శేషయ్యగారి భవనమున బ్రాహ్మ కాన్ఫరెన్సు జరుపబడినది. శ్రీయుత పండిత, కేశవరావు వకీలుగారు అధ్యక్షులుగా నుండిరి. సాయింత్రము ప్రీతి భోజనము గావింపబడి సర్వసోదరులు గూడి బ్రహ్మోత్సవానందముతో ప్రార్థనలు సలిపి జయ జయ ధ్వనులతో సభ చాలించబడెను.

సమాజ సేవకుడు,

మా. వెం. భా.

---

# లేఖలు.

—:o:-:o:—

## గుంటూరు స్త్రీ సమాజము.

గుంటూరు స్త్రీ సమాజము యొక్క కోర్కె ననుసరించి శ్రీమతి జ్ఞానమాంబ గారు శనివారమునాడు (౨౩–౪–౨౧) ఇచ్చటికి విచ్చేసి అరండలు పేటలోని కమ్మవారి సత్రమునందు భక్తిని గూర్చి మనోహరమైన ప్రసంగము గావించిరి. అనేక నారీమణులు వారి ఉపన్యాసామృతమును గ్రోలి సంతుష్టాంతరంగులైరి. మరునాడు వారు స్త్రీ సమాజమునందు ఉపాసనను గావించి సభ్యురాండ్రకు గల సందేహములను నివారించి యేకేశ్వరారాధనమునందు అభిరుచిని గల్గించిరి.

ఒక విలేఖరి.

---

## గండేరు గ్రామ సంఘము.

కాకినాడ తాలూకా గండేరు గ్రామంలో గోదావరి జిల్లా కాంగ్రెసు సంఘము స్థాపించుటకు కాకినాడ నుంచి వల్లూరి వెంకట శ్రీరామారావుగారు మా గ్రామమునకు విచ్చేసి రాట్నముయొక్క మహోద్దేశ్యము ఉత్సాహ పూరితముగ మాకు వెలుపుచ్చి ఉత్సాహముతో ఉత్సవమును ౧౦౦ మంది (యువకులు ముసలులు, స్త్రీలు, బిడ్డలు)తో రాట్నముయొక్క ముఖ్యావశ్యకతను వెలుపుచ్చుటకు గ్రామమంతయు వూరేగించి సాయంకాలము ౬ గంటలకు ఉత్సవమును ముగించితిమి. గ్రామంలో తోరణములు కట్టి రాత్రి ౭ గంటలకు ౨౦౦ మంది ప్రజలతో నానా జాతులతో నిండియున్న సభయందు ధర్మసమ్మతమగు శాంతి పద్ధతు లన్నిట వల్లను భారతదేశ ప్రజలు స్వరాజ్యమును పొందుట, భారతదేశ మహాజనసభయొక్క ముఖ్యోద్దేశము లన్నిటిని విపులముగా ముచ్చటించి మా గ్రామస్థులందరిని ఆనంద పర్చిరి. యిపుడు మా గ్రామమునందు మొట్టమొదట నానా వర్ణములు వారు కలసి ౧౨ గురు మాత్రమే సభ్యత్వము వహించిరి. కాని గాంధిమహాత్ముని యొక్క మహోద్దేశ్యము జయమగు చున్నదేమో యన్నట్లు యిపుడు మా చిన్న గ్రామమునందు నానా వర్ణములు వారు కలసి ౬౦ మంది సభ్యత్వము వహించిరి. మా చిన్న సంఘమునకు ర్యాలి నరసింహస్వామూర్తి గారు అధ్యక్షులు పదవినిన్ని శ్రీవత్సవాయ రాజం రాజుగారు కార్యదర్శి పదవిని వుండునట్లు ప్రార్థించగా వారు అంగీకరించిరి.

గరిమెళ్ల సత్య వీరభద్రరావు.

---

**The Dharma Sadhani Press,**

COCANADA.

*All Kinds of Job work*
*in*
**English & Telugu**
***Promptly and Neatly***
***executed.***



## యోగము.

పరోక్షము: అపరోక్షము.

ధర్మజీవనమునకు తోడ్పడు ఉత్తమ గ్రంథరాజము.

భక్తాగ్రేసరులు.

బ్రహ్మానంద కేశవచంద్రునిచే

విరచితమగు

సుప్రసిద్ధ గ్రంథమునకు

ఆంధ్రీకృతము.

వెల వి. పీ ఖర్చులతో 5 అణాలు.

వలయువారు:—

ధర్మసాధనీ కార్యస్థానము,

కాకినాడ.

అని వ్రాయవలయును.



## కేసరి—రత్నత్రయము.

### లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలను కలుగు ఋతుశూలు, బహిష్టు కాకుండుట, అకాల బహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగాను పోవుట, పసుపు రోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, నూతికా వాతము, కీళ్ళ నొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీముఖ్య వ్యాధులను కుదుర్చును. 24. డో రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్ఫోటక, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి సుఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. 5. 12అవున్సులు బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకాంత, మన్యసమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిన మహోష్ణ్యములను కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరకుటీరం, ఆయుర్వేద ఔషధశాల,

ఎగ్మోర్, మదరాసు.



# P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజావూరు.

ఓడి కోలన్.

ఇది సీమనుంచి రప్పించినది కాదు మాయొక్క ఔషధశాలయందు మాయొక్క స్వీయముగాను తయారు చేయబడినది. మనసు ప్రేమను కలిగే టటువంటి సువాసనగలది దేహమునందు పూయవచ్చును. మరిన్ని వస్త్రములకు వేయవచ్చును. దీని నుపయోగించిన వాత తలనొప్పి గుణమియ్యేది గాకుండా దేహశ్రమ పరిహారమగును. చాలా సేపు వాసనయుండిన్ని నుపయోగించినవారు వాళ్లచుట్టి సువాసన విస్తరించియుండును సాధారణముగ నీళ్లయందు కలిపి అంగళ్లయందు అమ్మ సరకులవలె లేకుండా యిది యొక స్వయముగా వాసనగలిగినది. అంగళ్లయందు అమ్మ (ఓడి కోలన్) ~~TO~~యొక్కలను నుపయోగించిన యెడల మావల్ల తయారుచేసి అమ్మతూవచ్చెడు ఓడికోలన్ 2 బొట్లు నుపయోగించినా చాలును ½ అవున్సు సీసాలయందు అమ్మబడును. వెల సీసా 1 కి అ. 8, వి. పి. శెలవు 1 మొదలు 6 సీసాలవరకు అ 8 ప్రత్యేకము.

మేలయిన వాసనబిళ్ళలు:—మేలయిన గులాబి, మేలయిన మోతియా మేలయిన లవండర్ ఇత్యాదులతో చేయబడినది. వస్త్రములకు నుపయోగించతగిన మంచి వాసనగల బిళ్ళ డబ్బి 1 కి అణాలు 8, వి. పి. శెలవు 1 మొదలు 6 డబ్బీలవరకు అణాలు 8 ప్రత్యేకము.

బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక నారను వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి, చార్జి 7 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

## అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్తక్యాలండరు

విక్రయమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనె వ్రాసుకొనవలయును.

| లామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్నినొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బీలో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేరు.

అమృతాంజనము డిపో,

౧౦౯, ఫేరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదరాసు.



శ్రీమాన్ వైద్యరత్న పండిత
డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

55, ఆచారప్పన్ వీధి. జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రయింపబడును.

ప్లేగు, కలరా, ఇన్ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకును. తదితర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

ఎన్. మాధవమీనన్ (ఆయుర్వేదాచార్య)
తంతి విలాసము } డి. దేశికాచార్యులు,
'పండిట్', 'మదరాసు.' } జాయింటు ప్రొప్రయిటర్లు.


## ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ " | " 40 | " 24 | " 16 |
| ¼ " | " 24 | " 16 | " 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.


**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


V. P. Rs. As. To M...




61 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry.